క్లుప్తంగా

లబ్ధిదారులకు సర్టిఫికెట్లు

హన్వాడ: మండలంలోని పెద్దర్పల్లి గ్రామంలో శనివారం విశ్వకర్మ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకుడు రఘురాములుగౌడ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్న విశ్వకర్మ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, నాయకులు కృష్ణయ్యగౌడ్, కమ్మ రిసిద్దప్ప, నాగన్న, ఈశ్వరయ్య, చెన్నయ్య, కేశవులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఓఏఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓంకార్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా(హెచ్‌ఆర్‌ఓఏఐ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓంకార్ ఎన్నికయ్యారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా భీంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాలప్రసాద్ ఎన్నికయ్యారు. సౌత్‌ఇండియా మహిళా విభాగం చైర్మన్ ధనలక్ష్మి, రాష్ట్రఅధ్యక్షుడు మోమిన్‌బాషా, మహిళా రాష్ట్రఅధ్యక్షురాలు శ్రీలత ఉన్నారు.

విద్యార్థులకు బూట్లు, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ

హన్వాడ: మండలంలోని కొనగట్టుపల్లి, తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలల్లో బుద్దారా మంబీఎల్ఐఏ హైదరాబాద్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చలి దుప్పట్లు, స్వెట్టర్లు, బూట్లు, స్కూల్‌బ్యాగ్‌లు పంపిణీ చేశారు. సింగపూర్ బుద్ధిస్ట్ డోనర్స్ సంస్థ ద్వారా వీటిని విద్యార్థులకు అందజేశారు.

చిత్రలేఖనం పోటీలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. 34మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని చిత్రాలను వేశారు. పోటీలను హెచ్ఎం జ్యోతి పర్యవేక్షించారు. పోటీల విజేతలకు ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేయనున్నట్లు ఉపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు.

అంబేడ్కర్ చిత్రాలు పెట్టాలి

మహబూబ్‌నగర్ రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలతో పాటు ఎక్కడైతే జాతీయ పతాకం ఎగుర వేస్తారో అక్కడ అంబేడ్కర్ చిత్రపటాలను ఉంచాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల, కళాశాల, జెండా ఎగురవేసే చోట అంబేడ్కర్ చిత్రపటాలు పెట్టి జెండా ఎగురవేసేలా కలెక్టర్ ద్వారా ఆదేశాలు ఇప్పించాలని ఏఓను కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి గోకం చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: మండల కేంద్రంలో అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మిడ్జిల్ సమీపంలో రెండు ట్రాక్టర్లు అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో వాటిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. కాగా ట్రాక్టర్ డ్రైవర్లు పరారయ్యారు.

ఆర్థికసాయం అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లికి చెందిన బోయ మొగులయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోటకదిర సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లు వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు యువకులు శనివారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. గ్రామపెద్దలు, యువకులు, మహిళా సమాఖ్య సభ్యులు తమకు తోచినంత వేసుకొని అంత్యక్రియల కోసం మృతుడి భార్య సత్యమ్మకు రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

హన్వాడ: బైక్‌ను లారీ వెనక నుంచి ఢీకొనడంతో ఓవ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చిన్నదర్పల్లి సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ మండలంలోని వెంకటాపూర్‌కి చెందిన బొబ్బిలి కృష్ణారెడ్డి, వడ్ల గోపాల్ బైక్‌పై జిల్లా కేంద్రం వైపు వస్తున్నారు. వేగంగా వచ్చిన లారీ వీరిని వెనక నుంచి ఢీకొట్టింది. గోపాల్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. బొబ్బిలి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీల వాటా తేల్చాల్సిందే

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే స్థానిక సంస్థలు, పురపాలక ఎన్నికలు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల రాజకీయ వాటా తేల్చాల్సి ఉందని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతానికి పైగా ఉన్న బీసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లోనూ స్వాతంత్య్రం వచ్చి నప్పటి నుంచి నేటివరకు వెనుకంజలో ఉన్నారన్నారు. రాజకీయ రంగంలో అగ్రకులాల వారు బీసీలను అడుగడుగునా అణచివేస్తున్నారని తెలిపారు.

ఓటే వజ్రాయుధం

- ఘనంగా ఓటరు దినోత్సవం
- ఓటరు ర్యాలీలు, ప్రతిజ్ఞలు



మహబూబ్‌నగర్‌లో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్ : ఓటే వజ్రాయుధమని, ఓటు హక్కు కలిగిన తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 25న ప్రతి ఏడాది జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అధికారులు, విద్యార్థులు, ప్రజలు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం తప్పకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞలు చేశారు. ఈ సంవత్సరం 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం 'ఓటు మించి ఏమీ లేదు.. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే అంశంతో నిర్వహించారు.

■ నవాబుపేట మండల కేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నవాబుపేటలో అంబేడ్కర్ చౌరస్తాలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ మాధవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

■ మిడ్జిల్ మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర ఓటరు ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు సరస్వతి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలో బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ ఓటు హక్కు అవశ్యకతను వివరించారు. ర్యాలీలో ఎంఈఓ మంజులాదేవి పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలో బాదేపల్లి హైస్కూల్ విద్యార్థిని సాహితి మొదటి బహుమతి సాధించగా కలెక్టర్ విజయేందిర బోయి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

■ అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అడ్డాకుల, మూసాపేటల్లో తహసీల్దార్లు మదన్‌మోహన్‌గౌడ్, రాజులు తమ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ల ఆవరణలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

■ చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఓటరు దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి హాజరయ్యారు. విద్యార్థులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయం నుంచి భూత్పూర్ చౌరస్తా వరకు స్థానిక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, అధికారులు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఎం.ఏ. రహ్మాన్, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీఓ శ్రీదేవి, ఆర్ఐ వెంకటేష్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

■ హన్వాడ మండల కాంప్లెక్స్ నుంచి విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కిష్ట్యానాయక్ ప్రధానరహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ముందు విద్యార్థులు, గ్రామపెద్దలు, ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సాయిబాలాజీ మీసేవా కేంద్రంలో ఆపరేటర్లు, కేంద్రానికి వచ్చిన కస్టమర్లతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఆపరేటర్లు కార్తీక్, శ్రీకాంత్, స్థానికులు పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్‌లోని రాజేంద్రనగర్ సద్దలగుండు బీఎల్ఓ 259, 260, 261 కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బీఎల్ఓ, తదితరులు ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్ సత్యనారాయణ, బీఎల్ఓలు పద్మ, నిర్మల, హబీబా, అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌బాబా, మహ్మద్‌యాఖూబ్, న్యాయవాది మహ్మద్ అబ్దుల్ హాదీ, స్టాన్లి మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో..



హన్వాడలో..



మూసాపేటలో ..



భూత్పూర్ చౌరస్తాలో..



జడ్చర్లలో ర్యాలీ..



నవాబుపేటలో ..

'సంక్షేమం' అమలుకు శ్రీకారం

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలకు ఆదివారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఎ.శాంతకుమారి శనివారం మధ్యాహ్నం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ నాలుగు పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవానికి ప్రతీ మండలంలో ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. ఆ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించాలని, మధ్యాహ్నం 1గంటకు సంక్షేమ పథకాల అమలుకు ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను స్క్రీన్ ద్వారా ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డులకు తహసీల్దార్ నేతత్వంలో, ఇందిరమ్మ ఇళ్లకి ఎంపీడీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు వ్యవసాయ అధికారి నేతత్వంలో, ఆత్మీయ భరోసాకి ఏ.పీ.ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఓవరాల్ ఇంచార్జీలుగా వ్యవహరిస్తూ సంక్షేమాల అమలు ప్రారంభోత్సవాన్ని విజయవంతమయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే బెల్ట్‌లు ప్రదానం చేస్తున్న ఎస్పీ జానకి

దేవరకద్ర రూరల్: ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని ఎస్పీ జానకి అన్నారు. శనివారం వెంకటాయపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే కరాటే డూఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థినులకు బెల్టులు ప్రదానం చేశారు. ఉచిత కరాటే శిక్షణ ఇప్పించిన దాత రామాంజనేయులును ఎస్పీ అభినందించారు. ఎస్పీని మహిళలు శాలువతో సన్మానించారు. ఎస్ఐ నాగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడిపోయిన వేరుశనగ ధరలు



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు ఒక్కసారిగా తగ్గాయి. ఈ నెల ప్రారంభంలో క్వింటాల్ ధర రూ.6,900 పైచిలుకు ఉన్న ధర క్రమేణా తగ్గిపోతోంది. రోజుకు కనీసంగా రూ.100కు పైగా ధరలు తగ్గుతున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి యార్డుకు 4,281 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. అయితే క్వింటాల్ గరిష్టంగా రూ.6,202, కనిష్టంగా రూ.3,515 ధరలు లభించాయి. శుక్రవారం ధరలతో పోలిస్తే క్వింటాల్‌కు గరిష్టంగా రూ.187, కనిష్టంగా రూ.506 తగ్గడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పది రోజులుగా యార్డుకు పెద్దమొత్తంలో వేరుశనగ దిగుబడులు వస్తుండడంతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వేరుశనగ ధరలు పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

■ ఇదిలా ఉండగా.. కందులు క్వింటాల్ గరిష్టంగా రూ.6,989, కనిష్టంగా రూ.5,667, పత్తి గరిష్టంగా రూ.6,929, కనిష్టంగా రూ.5,454, మొక్కజొన్న రూ.2,405, ఆముదాలు రూ.5,500, హంస రూ.1,930, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,641, కనిష్టంగా రూ.2,501 ధరలు వచ్చాయి.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులకు ఫ్యామిలీ కిట్స్, బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. పలు వార్డులలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. విద్యానిధికి కాంగ్రెస్ నాయకుడు రాషెద్‌ఖాన్ రూ.50 వేల చెక్కు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు లయన్ నటరాజ్, కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, సీజే బెన్‌హర్, అజ్మత్‌అలీ, ఖాజాపాషా, అవేజ్, నాగరాజు పాల్గొన్నారు.

సుహృద్భావ వాతావరణంలో కౌన్సిల్

ఏడాది పాటు సుహృద్భావ వాతావరణంలో కౌన్సిల్ సమావేశాలు జరిగాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కౌన్సిలర్లు ప్రజలకు ఇచ్చిన హామీలు, మాటను నిలబెట్టుకున్నామనే సంతృప్తితో అందరూ ఉన్నారన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించి వారితో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. విద్యానిధికి ఆర్పీలు రూ.20 వేల విలువజేసే చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ బెక్కరి అనిత, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణ జరిగితేనే న్యాయం



మందకృష్ణమాదిగను కలిసి మద్దతు ప్రకటిస్తున్న మల్లెపోగు శ్రీనివాస్, మేడి పాపయ్య

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'లక్ష డప్పులు వెయ్యి గొంతుకులు' సభకు శనివారం ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు చీమల దండులా కదిలిరావాలని పిలుపునిచ్చారు. దేశమంతా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతుంటే మాల సామాజిక వర్గానికి చెందిన కొందరు వర్గీకరణను వ్యతిరేకిస్తూ, కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభకు మాదిగలు ఆటపాటలు, డప్పుల దరువులతో భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, పొలిట్‌బ్యూరో సభ్యులు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలి



కుమార స్వామి గౌడకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశంలో ప్రైవేట్ రంగంలోనూ ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని సౌత్ ఇండియా అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి, జనతాదళ్(సెక్యులర్) జేడీ కుమారస్వామిగౌడకి విజ్ఞప్తి చేశారు. శనివారం దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘాల నేతలు బాలరాజు గుత్తేదార్, శివకుమార్, ఓంకార్, గోపిగౌడ్ బెంగుళూరులో కుమారస్వామిగౌడని ఆయన నివాసంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో కర్నాటకలోనూ అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

జైలులో ఖైదీలు బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పాపిరెడ్డి

పాలమూరు: వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకొని శిక్షాకాలం ముగిసిన తర్వాత కుటుంబంతో కలిసి సంతోషకరమైన జీవనం కొనసాగించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా జైలులో అండర్ ట్రయల్ ఖైదీల హక్కులు, శిక్షపడిన ఖైదీల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతి థిగా హాజరై చట్టాలపై ఖైదీలకు న్యాయ సలహాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలులో ఉన్న ప్రతి ఖైదీ బాధ్యతగా ఉంటూ శిక్షకాలం పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర, న్యాయమూర్తి భావన, పుట్టపాగ రఘుపతి, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు కఠినంగా మారుతాయి

పాలమూరు: రాబోయే రోజుల్లో రోడ్డు నిబంధనలు మరింత కఠినంగా మారుతాయని సీనియర్ ఎంవీఐ వాసుదేవ్‌రావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాలలో రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌పై పూర్తిగా అవగాహన వచ్చి, లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనాలు నడపాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ప్రాజెక్ట్ మేనేజర్ దీప, సంతోష్‌కుమార్, తేజస్వరూప సిబ్బంది పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడపొద్దు

రాజాపూర్: తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని ఐసడక్ జనరల్ మనేజర్ మహ్మద్ ఇబ్రహీం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం రాజాపూర్, బాలానగర్ మండల కేంద్రంలో వాహనదారులకు ప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ వాడాలని, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. రోడ్‌సేఫ్టీ మేనేజర్ భానుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం

భూత్పూర్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సిబ్బంది చైర్మన్ బస్వరాజ్ గౌడ్‌ను, కౌన్సిలర్లను శాలువ, పూల మాలలతో ఘనంగా ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చైర్మన్ వివరించారు. మేనేజర్ శంకర్, ఆర్ఐ నర్సింహులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

జడ్చర్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కొత్త బస్టాండ్ ,రైల్వే స్టేషన్ తదితర రద్దీ ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సీఐ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపొందుతుందని కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మ ఖిబ్రా బేగం గ్రీన్ నుంచి బ్లూ బెల్టు, కె.తనిష్ ఎల్లో నుంచి ఆరెంజ్ బెల్టు, మహ్మద్ ఇబ్రెజ్ వైట్ నుంచి ఎల్లో బెల్టు, మహ్మద్ బిలాల్ ఆజం వైట్ నుంచి ఎల్లో బెల్టులు పొందినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు.

జాంబోరి శిబిరానికి 'ప్రేరణ' విద్యార్థులు

జడ్చర్ల టౌన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ జాంబోరి శిబిరానికి పట్టణంలోని ప్రేరణ స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ గోపినాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన చరణ్, అభిరాం, అభిలాష్, అహ్మద్ అలీలు, గైడ్ కెప్టెన్ అమరావతి వెళ్తున్నారన్నారు. ఈ విద్యార్థులను శనివారం పాఠశాల ప్రాంగణంలో అభినందించి తమిళనాడు తిరుచ్చికి పంపించారు.